

గంజాయి విక్రేతల అరెస్ట్
ఒడిశా నుంచి గంజాయిని తీసుకువచ్చి కోదాడలో విక్రయిస్తున్న పలువురిని పోలీసులు పట్టుకున్నారు.
- 10లో



సృజనాత్మక వేదిక..
నల్లగొండ డాన్‌బాస్కో స్కూల్‌లో శుక్రవారం జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభమైంది.
-10లో



బుద్ధవనం.. అద్భుతం
బుద్ధవనంలోని శిల్పాలు అద్భుతమని విదేశీ బౌద్ధ పరిశోధకులు సారా కెన్డర్‌లైన్, జాఫ్రిషా అన్నారు.
- 12లో

న్యూస్‌రీల్

బాలికలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న శ్రీవాణి

చివ్వెంల: అనుమానిత వ్యక్తుల పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి అన్నారు. శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని మద్దిరాల మండలానికి చెందిన జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో సావిత్రిబాయ్ పూలే జయంతి సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలికలకు చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళల అభ్యున్నతి కోసం సావిత్రిబాయ్ పూలే చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలన్నారు. డీపీలలో తమ ఫొటోలు పెట్టుకోవద్దన్నారు. సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుపుకు మల్లయ్య, డిఫెన్స్ కౌన్సిల్ వసంత సత్యనారాయణ పిళ్లే యాదవ్, బొల్లెద్దు వెంకటరత్నం, బట్టిపల్లి ప్రవీణ్ కుమార్, న్యాయవాదులు గోండ్రాల అశోక్, తల్లమళ్ల హస్సేన్, ఎడిండ్ల అశోక్, ఎస్‌ఐ ఆంజనేయులు పాల్గొన్నారు.

పింఛన్‌దారులను మోసం చేసిన కాంగ్రెస్

సూర్యాపేట: చేయూత పింఛన్‌దారులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) జాతీయ కోర్ కమిటీ కోకన్వీనర్ అందె రాంబాబు అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆ సమితి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి గద్దం కాశీం, రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య, కర్ల విజయరావు, పెరిక శ్రీనివాసులు, రావి స్నేహలత చౌదరి, జహీర్ బాబా, బాబు, చింత సాంబయ్య, మిద్దె సైదులు, సోమపంగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, ఔషధ మొక్కల విత్తనాలు నాటాలి



కోమటిపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న డీపీఓ

అర్వపల్లి: వన నర్సరీల్లో తప్పనిసరిగా పండ్లు, పూలు, ఔషధ మొక్కల విత్తనాలను నాటాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) నారాయణరెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం జాజిరెడ్డిగూడెం మండలం కోమటిపల్లి వన నర్సరీని, తిమ్మాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, గ్రామ పంచాయతీల్లో అన్ని రికార్డులు, సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలను సక్రమంగా నిర్వహించాలని కోరారు. గ్రామాల్లో ఉన్న కోనోకార్పస్ మొక్కలను వర్షాకాలం సీజన్‌లో తొలగించి వాటి స్థానంలో ఇతర మొక్కలు నాటాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీఓ టి.గోపి, పంచాయతీ కార్యదర్శులు కృష్ణవేణి, నవీన్‌రెడ్డి, రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ పరశురాములు, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమం జరిపారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆ తర్వాత ఉత్సవమూర్తులను పల్లకీలో కృష్ణానదిలోని ప్రహ్లాద ఘాట్‌కు తరలించి ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణవేణికి హారతినిచ్చారు. శ్రీస్వామి వారిని ఆలయ ప్రవేశం గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు బహిరంగ వేలం పాటలు
మట్టపల్లి క్షేత్రంలో కొబ్బరి కాయల విక్రయం, కిరాణ జనరల్ స్టోర్స్ నిర్వహణ, కొబ్బరి చిప్పల సేకరణకు ఈనెల 4న ఆలయ ఆవరణలో బహిరంగ వేల పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్తలు, ఈఓ తెలిపారు. ఏడాది కాలపరిమితి గల కొబ్బరి కాయలు విక్రయానికి రూ.3లక్షలు, కిరాణా జనరల్ స్టోర్స్‌కు రూ.3లక్షలు, కొబ్బరా చిప్పల సేకరణకు రూ.లక్ష చొప్పున డిపాజిట్‌లు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

వరిదే అగ్ర స్థానం

యాసంగి సాగు అంచనా 4.78 లక్షల ఎకరాలు

మొత్తంగా పంటల సాగు 5,02,372 ఎకరాలు
- వ్యవసాయ ప్రణాళిక ఖరారు
- గత యాసంగి కన్నా 96,685 ఎకరాలు అధికం
- 1,15,070 మెట్రిక్ టన్నుల ఎరువులకు ప్రతిపాదనలు
- ఊపందుకున్న సాగు పనులు



పాలకవీడులో వరినాట్లు వేస్తున్న కూలీలు

భానుపురి (సూర్యాపేట): జిల్లాలో యాసంగి పంటల సాగు ప్రణాళిక ఖరారైంది. జిల్లాలో దాదాపు 5,02,372 ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేయనున్నారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో అగ్రభాగం 4,78,147 లక్షల ఎకరాల్లో వరి సాగు ఉంటుందని లెక్కలు వేశారు. ఈసారి ఆలస్యంగానైనా మంచి వర్షపాతం నమోదు కావడంతో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో యాసంగి సాగు కూడా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. దీనికి తోడుగా సాగర్, మూసీ, ఎస్సారెస్పీ రెండోదశ కింద పంటల సాగుకు ప్రభుత్వం నీటిని విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు పంటల సాగు పెరుగుతుందని ప్రణాళికలో పొందుపర్చారు.

ముమ్మరంగా వరినాట్లు
జిల్లాలో 15 రోజులుగా యాసంగి సాగు పనులు ఊపందుకున్నాయి. ప్రధానంగా వరిసాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అక్కడక్కడా వరి నాట్లు వేస్తుండగా.. చాలావరకు పొలాలను దమ్ము చేస్తున్నారు. అయితే గతేడాది యాసంగిలో 4,05,687 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు కాగా.. ఈయేడు 96,685 ఎకరాలు అధికంగా ఉంటుందని భావిస్తున్నారు. గతేడాది ఎస్సారెస్పీ రెండోదశ ఆయకట్టుకు ఆరుతడి పంటలకు మాత్రమే నీటిని ఇవ్వడంతో ఈ ప్రాంతంలో దాదాపు లక్షల ఎకరాలకు పైగా సాగు జరగలేదు. అయితే ఈ యాసంగిలో బుధవారం జిల్లాకు నీటిని విడుదల చేయడంతో సాగు పెరగనుంది. అధికారులు సైతం పెరిగే సాగు అంచనాల్లో వరి 94,498 ఎకరాల్లో ఉంటుందని పేర్కొనడం గమనార్హం.

అవసరమైన విత్తనాలు 1,44,034 క్వింటాళ్లు
వ్యవసాయ అధికారులు వేసిన సాగు అంచనాకు జిల్లా మొత్తంగా దాదాపు 1,44,034 క్వింటాళ్ల విత్తనాలు అవసరం కానున్నాయి. ఇందులో వరి 1,43,444 క్వింటాళ్లు, 42 క్వింటాళ్ల జొన్నలు, 1.5 క్వింటాళ్ల కందులు, 27 క్వింటాళ్ల పెసర, 520 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అవసరమవుతాయని సిద్ధం చేశారు. ఇక 68,820 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం కాగా 19,037 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. డీఏపీ 5650 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 37,250 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 1900 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 1450 మెట్రిక్ టన్నులు కావాల్సి ఉంది. అయితే డీఏపీ 1082, కాంప్లెక్స్ ఎరువులు 12,316, ఎంఓపీ 745, ఎస్ఎస్‌పీ 843 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

2025 యాసంగి సాగు అంచనా ఇలా..

పంట	విస్తీర్ణం (ఎకరాలలో..)
వరి	4,78,147
జొన్న	519
కంది	25
పెసర	450
వేరుశనగ	866
చెరుకు	273
మిర్చి	201
పామాయిల్	4,565
ఇతర పంటలు	1,323
పండ్లు, కూరగాయలు	16,003
మొత్తం	5,02,372

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం
జిల్లాలో సాగు ప్రణాళికను అంచనా వేశాం. దాదాపు 5,02,372 ఎకరాల్లో పంటలను రైతులు సాగు చేస్తారని భావిస్తున్నాం. ఈ మేరకు రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులకు ఎలాంటి కొరత లేకుండా చూస్తున్నాం. ప్రభుత్వం ఎప్పటికప్పుడు విత్తనాలు, ఎరువులను సరఫరా చేస్తుంది.
– శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

జాన్‌పహాడ్ ఉర్సుకు సిద్ధంకండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, చిత్రంలో వివిధ శాఖల అధికారులు

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్
- అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం

పాలకవీడు: పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్‌లో ఈ నెల 23, 24, 25 తేదీల్లో జరగనున్న ఉర్సు ఉత్సవాలకు అన్ని శాఖల అధికారులు సమన్వయంలో పనిచేస్తూ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. దర్గా ఉత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం జాన్‌పహాడ్ దర్గా వద్ద ఎస్‌కెఎస్ ఫంక్షన్‌హాల్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవ ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు సమీక్షించనున్నట్లు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ, వక్ఫ్‌బోర్డు అధికారులకు సూచించారు. దర్గా పరిసరాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలోనే అన్ని శాఖలతో రివ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా దర్గను దర్శిచుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్గా పరిసరాలు, వివిధ రూట్లలో పార్కింగ్ స్థలాలు పరిశీలించారు.

వక్ఫ్‌బోర్డు నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి
దర్గా వద్ద సరైన వసతులు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సౌకర్యాలు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వక్ఫ్‌బోర్డు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దాదాపు రూ.రెండు కోట్ల ఆదాయం సమకూరుతున్న ఈ ఉత్సవాలకు కనీసం రూ.50 లక్షలు నిధులు మంజూరు చేసేలా అధికారులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, సీఐ చరమందరాజు, మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్, మాజీ జెడ్పీటీసీ బుజ్జిమోతీలాల్, నాయకులు ఎస్‌వీ.సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సావిత్రిబాయి కృషితోనే మార్పు

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

భానుపురి (సూర్యాపేట): సావిత్రిబాయి పూలే త్యాగాలతోనే సమాజంలో మార్పు మొదలైందని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. భారత్ స్వాతంత్ర్య దేశంగా అవతరించక ముందే దేశంలో అణగారిన వర్గాలు, స్త్రీల హక్కులు, విద్య కోసం మహాత్మా జ్యోతిరావు పూలే దంపతులు ఎంతగానో పోరాడారని గుర్తుచేశారు. అదనపు కలెక్టర్ పి.రాంబాబు మాట్లాడుతూ నేటి ఉపాధ్యాయులు.. సావిత్రిబాయి పూలే అడుగుజాడల్లో నడుస్తూ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ అశోక్, సంక్షేమ శాఖ అధికారులు లత, అనసూర్య, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌రెడ్డి, సూపరింటెండెంట్లు పద్మారావు, శ్రీలత, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో వచ్చే ప్రజలను ఆదుకోవాలి
సమస్యలతో వచ్చే ప్రజలకు సహాయం చేస్తూ ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి ఆయన ఇటీవల టీజీపీఎస్సీ ద్వారా ఉద్యోగం పొందిన 47 మందికి కౌన్సిలింగ్ నిర్వహించి రెవిన్యూ శాఖలో పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో కష్టపడి ఉద్యోగం సాధించినందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపరింటెండ్ పద్మారావు, సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రజలకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రవాణా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన జాతీయ రోడ్డు ప్రభుత్వ భద్రతా మాసోత్సవం -2025 వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కొత్త సంవత్సరం ఈనెల 31 జాతీయ రహదారి భద్రత మాసహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ పి.రాంబాబు, జిల్లా రవాణా శాఖ అధికారి జి.సురేష్‌రెడ్డి, ఎంబీఏ జయప్రకాశ్‌రెడ్డి, ఈ ఆదిత్య, డీబీఐ ఆంజనేయులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖపై నమ్మకం పెంచాలి

- ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్



చెక్కు అందజేస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట టౌన్: జిల్లాలో శాంతి భద్రత పరిరక్షణలో పోలీసులు బాగా పనిచేస్తున్నారని, అలాగే ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తూ పోలీస్ శాఖపై నమ్మకం పెంచాలని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నూతన సంవత్సరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ కేక్ చేసి పోలీసులకు, సిబ్బందికి మిఠాయిలు పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది ఆరోగ్యంగా ఉండాలని, కుటుంబాలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. నేరాల నియంత్రణకు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, డీఎస్పీలు రవి, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసరావు, మట్టయ్య, నరసింహాచారి, మంజుభార్గవి, సీఐలు వీరరాఘవులు, రాజశేఖర్, శ్రీను, రఘువీర్‌రెడ్డి, రాము, రజితారెడ్డి, రామకృష్ణారెడ్డి, చరమందరాజు, లక్ష్మీనారాయణ, నాగభూషణం, హరిబాబు, శివకుమార్, ఆర్ఐ నారాయణరాజు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాల సంక్షేమానికి కృషి
పోలీస్ కుటుంబాల సంక్షేమానికి పోలీస్ శాఖ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. సూర్యాపేట ఆర్మ్డ్ రిజర్వ్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాములు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా పోలీస్ భద్రతా పథకం ద్వారా మంజూరైన చెక్కును శుక్రవారం సూర్యాపేటలోని తన కార్యాలయంలో రాములు ఆయన కుటుంబ సభ్యులకు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలీస్ భద్రతా పథకం.. పోలీస్ సిబ్బంది కుటుంబాలకు ఎల్లవేళలా బాసటగా ఉంటుందని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారు ఏ అవసరమున్నా తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఏఓ మంజుభార్గవి పాల్గొన్నారు.



జిల్లా పోలీస్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, ఏఎస్పీ, డీఎస్పీలు

గోదావరి జలాలు తగ్గిస్తూ.. పెంచుతూ..

అర్వపల్లి: యాసంగి సీజన్‌కుగాను గోదావరి జలాలను బుధవారం విడుదల చేయగా గురువారం రాత్రి ఒక్క సారిగా తగ్గించారు. తొలుత 500క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ఆ తర్వాత 800 క్యూసెక్కులకు పెంచారు. మళ్లీ గురువారం రాత్రి 500 క్యూసెక్కులకు తగ్గించారు. శుక్రవారం రాత్రి మైలారం రిజర్వాయర్ నుంచి నీళ్లు బయ్యన్నవాగుకు వదలడంతో మళ్లీ జిల్లాకు 700 క్యూసెక్కులకు పెంచినట్టు నీటి పారుదలశాఖ ఏఈఈ అమర్ తెలిపారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



నాగారం పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ కోటాచలం

నాగారం: వైద్యసిబ్బంది.. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం అన్నారు. శుక్రవారం నాగారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పుల సంఖ్యను పెంచాలన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు. పలు సూచనలు చేశారు. సమావేశంలో డాక్టర్ హర్షవర్ధన్, హెచ్ఈఓ మాలోతు బిచ్చునాయక్, హెచ్ఈ విమలమ్మ, పీహెచ్ఎస్ అరుణకుమారి, సూపర్‌వైజర్ వినోద, రామచంద్రు, పల్లె దవాఖాన డాక్టర్లు శ్రవణ్‌కుమార్, నాజీయ, సుజాత, సరస్వతి, యాదగిరి, ప్రవీణ్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు బాసట

- పీఎం స్వనిధి పథకం కింద విడతలవారీగా రుణం
- మొదటి విడతలో రూ.10వేలు.. నాలుగోసారి రూ.లక్ష
- సకాలంలో చెల్లించిన వారికే క్రమంగా పెంపు



హుజూర్‌నగర్‌లో వీధి వ్యాపారుల దుకాణాలు

హుజూర్‌నగర్ : ప్రధాన మంత్రి స్వనిధి పథకం మున్సిపాలిటీలలోని వీధి వ్యాపారులకు వరంగా మారింది. ఆర్థికంగా ఆదుకోవడంతోపాటు ఉపాధిని మెరుగుపరుచుకోవడానికి ఆసరా కల్పిస్తోంది. జిల్లాలోని మున్సిపాలిటీల్లో చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగించేవారికి నాలుగేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆత్మ నిర్భర్ పథకం కింద స్వల్పకాలిక రుణాలు మంజూరు చేస్తున్నాయి. పట్టణాల్లో వడ్డీ వ్యాపారుల నుంచి రక్షణ పొందేలా రోజు వారీగా పనిచేసే వీధి వ్యాపారులను గుర్తించి పేర్లను నమోదు చేసుకున్నారు. రూ.10 వేలు వారి ఖాతాలో జమ చేశారు. ఈ మొత్తాన్ని ఏడాదిలోపు వడ్డీతో సహా చెల్లించిన వారికి రెండో విడతలో రూ.20 వేలు అందించారు. తాజాగా ఈ మొత్తాన్ని మూడో విడతలో రూ.50 వేలకు పెంచారు. వీరిలో రుణాలు సకాలంలో సక్రమంగా చెల్లించిన వారు నాలుగో విడతలో భాగంగా లక్ష రూపాయల రుణం పొందేందుకు అర్హులు కానున్నారు. పీఎం స్వనిధి రుణం మొత్తం క్రమేణా పెరుగుతుండడంతో సరైన విధంగా వాయిదాలు చెల్లిస్తే బ్యాంకర్లే నేరుగా పెద్ద మొత్తంలో రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపించే అవకాశముంటుంది. తద్వారా వీధి వ్యాపారులు తమ వ్యాపారాల్లో మరింతగా అభివృద్ధి సాధించేందుకు మార్గం సుగమం అవుతుంది.

రుణాలు పొందిన వీధి వ్యాపారులు ఇలా..

మున్సిపాలిటీ	మొదటి	రెండోవ	మూడోవ
సూర్యాపేట	5,152	2,403	519
కోదాడ	3,135	1,819	572
హుజూర్‌నగర్	1,718	1,159	419
నేరేడుచర్ల	619	472	174
తిరుమలగిరి	923	516	199

సద్వినియోగం చేసుకోవాలి



వీధి వ్యాపారులు వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా బ్యాంకుల నుంచి రుణం పొంది ఆర్థికంగా బలోపేతం కావడానికి ఈ పథకం ఎంతగానో దోహదపడుతుంది. ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు విడతలవారీగా రుణం పెంచుతున్నారు. పలువురు వ్యాపారులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తున్నారు. ఇలా వాయిదాలను క్రమ పద్ధతిలో చెల్లిస్తున్న వారికి రుణాలు ఇప్పించడానికి కృషి చేస్తున్నాం. ఈ అవకాశాన్ని వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలి.
– రేణుక, మెప్మా ఇన్‌చార్జి పీడీ, సూర్యాపేట

ఇప్పటి వరకు మూడు విడతల్లో 19,799 మందికి..
జిల్లాలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరితో కలిపి మొత్తం ఆరు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆయా మున్సిపాలిటీల్లో ఇప్పటి వరకు మూడు విడతల్లో మొత్తం 19,799 మంది వీధి వ్యాపారులకు రుణాలు అందజేశారు. వీరిలో సూర్యాపేట మున్సిపాలిటీ అత్యధికంగా 8,074 మంది, అత్యల్పంగా నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో 1,265 మంది ఉన్నారు. అలాగే కోదాడలో 5,526 మంది, హుజూర్‌నగర్‌లో 3,296, తిరుమలగిరి మున్సిపాలిటీలో 1,638 మంది వీధి వ్యాపారులు బ్యాంకు రుణాలు పొందారు.

పట్టణ ప్రగతికి నిధులు!

- మున్సిపాలిటీలకు స్టాంపు డ్యూటీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం
- నేరుగా ఖాతాల్లో జమకానున్న నిధులు
- గత ప్రభుత్వం అమలు చేసిన విధానం మార్పు
- నిధుల లేమి నుంచి గట్టెక్కనున్న మున్సిపాలిటీలు



కోదాడ మున్సిపల్ కార్యాలయం

కోదాడ: ఏడాదిన్నర కాలంగా పట్టణ ప్రగతికి నిధులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్న మున్సిపాలిటీలకు ప్రభుత్వం తీపికబురు వినిపించింది. రిజిస్ట్రేషన్ శాఖ నుంచి స్థానిక సంస్థలకు వెళ్లాల్సిన స్టాంప్ డ్యూటీ ఆదాయాన్ని పాత పద్ధతిలో నేరుగా ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. దీంతో మున్సిపాలిటీలకు ఆర్థిక కష్టాలు తీరనున్నాయి. ఇదే జరిగితే జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐదు మున్సిపాలిటీలకు ఏటా కోట్లాది రూపాయల నిధులు నేరుగా ఖాతాల్లో జమకానున్నాయి. స్థానిక ఎన్నికల ముందు అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో ఎన్నికలపై ప్రభావం పడే అవకాశం ఉందని భావించిన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. వీటితో పాటు స్థానిక సంస్థల (గ్రామ పంచాయతీ)లకు కూడా స్టాంప్ డ్యూటీ నేరుగా ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మున్సిపాలిటీ	నిధులు (ఏడాదికి రూ.కోట్లలో..)
సూర్యాపేట	8
కోదాడ	6
హుజూర్‌నగర్	4
తిరుమలగిరి	3
నేరేడుచర్ల	3

గతంలో 4 శాతం నిధులు..
స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి స్టాంప్ డ్యూటీని గతంలో 4 శాతం స్థానిక సంస్థల ఖాతాల్లో నేరుగా జమచేసేవారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ నిధులను మున్సిపాలిటీలకు ఇవ్వకుండా ప్రభుత్వం నేరుగా తీసుకోసాగింది. ఆ తరువాత పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి పేరుతో ప్రతినెలా కొన్ని నిధులను స్థానిక సంస్థల ఖాతాల్లో జమ చేశారు. వీటితో ఆయా మున్సిపాలిటీలు, పంచాయతీల్లో అభివృద్ధి పనులను చేపట్టేవారు. గత ఎన్నికలకు ఆరు నెలల ముందు నుంచి ఈ నిధుల విడుదలను ప్రభుత్వం నిలిపివేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత పట్టణ ప్రగతి, పల్లెప్రగతి పథకాలను నిలిపివేశారు. దీంతో గడిచిన ఏడాదిన్నర కాలంగా నిధులులేక మున్సిపాలిటీల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులు మధ్యలోనే ఆగిపోయాయి. పనులను చేసిన కాంట్రాక్టర్లకు సైతం కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

27తో ముగియనున్న పాలక వర్గాల పదవీకాలం
జిల్లా వ్యాప్తంగా ఐదు మున్సిపాలిటీల పాలక వర్గాల పదవీకాలం ఈ నెల 27వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలోనే స్టాంప్ డ్యూటీ నిధులను మున్సిపాలిటీల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. నిధులు ఎలా, ఏయే పనులకు ఖర్చు చేయాలో గైడ్‌లైన్స్‌ను కూడా ప్రభుత్వం విడుదల చేయనుంది. ఈ నిధులను జిల్లా అదనపు కలెక్టర్ అనుమతితో మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులకు ఖర్చు చేయనున్నారు. మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులను చేపట్టిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం యోచిస్తోందని పలువురు అంటున్నారు.

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నల్లగొండ క్రైం: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి మనస్తాపం చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శుక్రవారం అన్నెపర్తి సమీపంలో చోటుచేసుకుంది. నల్లగొండ మండలంలోని అన్నెపర్తికి చెందిన గంట్ల జాన్‌రెడ్డి(38)వ్యవసాయం చేస్తూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మద్యంమత్తులో ఉన్న జాన్‌రెడ్డి మనస్తాపం చెంది గ్రామ సమీపంలో తిరుపతి- నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నల్లగొండ రైల్వే స్టేషన్ మాస్టర్ సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. అతడి మృతదేహాన్ని తల్లిదండ్రులు సత్తిరెడ్డి, కళమ్మలకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

సూర్యాపేటటౌన్ : పదకొండేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల1న సూర్యాపేట జిల్లా కేంద్రంలో నివాసం ఉంటున్న సాయి గణేష్ అనే యువకుడు తన పక్కింట్లో ఉంటున్న 11 ఏళ్ల బాలుడిని బలవంతంగా తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడడంతో బాలుడు అక్కడి నుంచి తప్పించుకుని అటు వైపు వెళ్తున్న స్థానికులను ఆశ్రయించాడు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు టౌన్ సీఐ వీరరాఘవులు శుక్రవారం తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

మిర్యాలగూడ టౌన్: నాగార్జునసాగర్ ఎడమ కాలువలో గల్లంతైన యువకుడి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. మిర్యాలగూడ రూరల్ ఎస్సై- 2 సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువ ఇంజనీర్ కార్తీక్ మిత్ర మిర్యాలగూడ మండలం ఐలాపురం వద్ద ఈనెల 1న ఎడమ కాలువలో పడి గల్లంతయ్యాడు. గరిడేపల్లి మండలం మర్రికుంట బ్రిడ్జి వద్ద అతడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడు మృతి



ఇస్లావత్ శరత్ మృతదేహం

త్రిపురారం: విద్యుదాఘాతంలో బాలుడు మృతి చెందిన సంఘటన త్రిపురారం మండలంలోని సత్యంపాడు తండా గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. తండాకు చెందిన ఇస్లావత్ కృష్ణ, సావిత్రి దంపతులకు చెందిన కుమారుడు ఇస్లావత్ శరత్(08) త్రిపురారం మండలం రాగడప గ్రామంలోని ప్రైవేట్ పాఠశాలలో చదువుకుంటున్నాడు. తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లమని చెప్పినా వినకుండా పొలం వద్దకు వెళ్లాడు. పొలం నాటు వేస్తుండడంతో పొలంపై వాలుతున్న కొంగలు వెళ్లగొట్టేందుకు పొలంలో తిరుగుతున్నాడు. ఈ క్రమంలో పొలంలో విద్యుత్ మోటార్ తీగలు తేలి ఉండడంతో ప్రమాదవశాత్తు వాటికి తగిలి మృతి చెందాడు. కాగా.. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం

పెన్‌పహాడ్: షార్ట్‌సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కీర్తి యలమంచయ్య తన వ్యవసాయ క్షేత్రంలోని పూరి గుడిసెలో ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ జరిగింది. దీంతో అందులోని డ్రిప్ సామగ్రి, సుమారు 10క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. స్థానికులు ఫైర్ ఇంజన్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు.

సృజనాత్మక వేదిక.. వైజ్ఞానిక ప్రదర్శన

- నల్లగొండలోని డాన్‌బాస్కో పాఠశాలలో సైన్స్ ఫేర్
- 100కుపైగా ప్రాజెక్టుల ప్రదర్శన

నల్లగొండ: వ్యవసాయ తదితర రంగాల్లో ఎదురవుతున్న సమస్యలపై ఆవిష్కరణలు చేసి సమాజ అభివృద్ధికి తోడ్పడాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులను సైన్స్ విజ్ఞానం వైపు మళ్లించే విధంగా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా నల్లగొండ డాన్‌బాస్కో స్కూల్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక, గణిత ప్రదర్శన చేపట్టారు. రెండు రోజుల పాటు జరగనున్న సైన్స్ ఫేర్ శుక్రవారం ప్రారంభమైంది.



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

వాటర్ బాటిల్ రాకెట్



త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థి వనం వంశీకృష్ణ వాటర్ బాటిల్ రాకెట్‌ను రూపొందించాడు. ఒక ప్లాస్టిక్ వాటర్ బాటిల్ తీసుకుని అందులో సగానికి నీరు తీసి మూత వైపు సైకిల్ ట్యూబ్‌కు అమర్చే వాల్‌ను బిగించాడు. సైకిల్ పంప్‌తో ఆ వాల్‌కు గాలికొట్టి బాటిల్‌లో గాలి నింపాడు. ఆ బాటిల్‌ను తిరగల తిప్పడంతో నీరంతా కిందకు వచ్చి, గాలి పైకి చేరుకుంది. మూత తీస్తే బాటిల్‌లో ఉన్న గాలి వాటర్ ఒత్తిడి ప్రేరేపించడంతో బాటిల్ రాకెట్ తరహాలో ఎగురుతుంది. భవిష్యత్‌లో గాలితోనే విమానాలు ఎగిరే విధంగా ఈ ప్రయోగం ఉపయోగపడుతుందని విద్యార్థి వంశీకృష్ణ తెలిపాడు.

వైజ్ఞానిక ప్రదర్శనలో విదేశీయులు

యూరప్‌కు చెందిన క్రిష్టినా, అన్నాలు దేశ పర్యటనలో భాగంగా నల్లగొండకు వచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం డాన్‌బాస్కో హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించారు. ప్రాజెక్టులు ఏ విధంగా ఉపయోగపడతాయో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.



ఎగ్జిబిట్లను తిలకిస్తున్న విదేశీయులు

ఫ్రూట్ కట్టర్



చందంపేట కేజీబీవీకి చెందిన 10వ తరగతి విద్యార్థిని ఝాన్సీ తక్కువ ఖర్చుతో కూడుకున్న ఫ్రూట్ కట్టర్‌ను రూపొందించింది. దీని సాయంతో వ్యవసాయ దారులు తమ బత్తాయి తోటల్లో పండ్లు కోసేందుకు వినియోగించుకోవచ్చు. 2 లీటర్ల ప్లాస్టిక్ వాటర్ బాటిల్ తీసుకుని, మూత వైపు గాకుండా అడుగు బాగాన్ని తామర పువ్వు ఆకారంలో కోసి బాటిల్ మూత లోపలి గుండా ఒక తాడు తీసుకొచ్చి బాటిల్ అడుగు బాగాన కట్ చేసిన మొనలకు ఆ తాడును కట్టాలి. పండుకు సరిపోయే విధంగా కట్ చేసిన ప్లాస్టిక్ బాటిళ్లకు స్ప్రింగ్ లాంటి రేకు పరికరాన్ని అతికించాలి. బాటిల్ మూత వైపు కూడా కట్ చేసి దానిని జ్యూట్ బ్యాగులోకి అమర్చాలి. ఆ తాడుకు ఒక పొడవాటి కట్టెను అమర్చాలి. దాని సాయంతో పండును బాటిల్‌లో నుంచి తాడుతో గుంజాలి. అక్కడ పండు చుట్టు అది ఉచ్చులా బిగుసుకుంటుంది. దీంతో పండు తెగి బాటిల్ నుంచి జ్యూట్‌బ్యాగ్‌లో పడుతుంది. ఇది రైతులతో పాటు పండ్ల చెట్లు పెంచే వారికి ఎంతో ఉపయోగపడుతుంది.

సైకిల్ వాషింగ్ మిషన్



దామరచర్ల మండలం కొండ్రపోల్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి భరత్ సైకిల్ వాషింగ్ మిషన్‌ను రూపొందించాడు. ఒక పాత సైకిల్ తీసుకుని వెనుక చక్రం తీసేశాడు. వెనుక చక్రం తిప్పేందుకు చైన్‌తో తిప్పే చక్రం ఉపయోగించి ఒక రాడ్‌ను కుడి వైపు గుండా అమర్చాడు. ఆ రాడ్ చుట్టూ ఒక ప్లాస్టిక్ డ్రమ్‌ను ఉంచాడు. డ్రమ్ లోపల నుంచి ఐరన్ పైప్ ఇవతల వైపున కూడా బేరింగ్ అమర్చాడు. డ్రమ్ లోపల ఉన్న ఐరన్ పైపు చుట్టూ డ్రమ్ ఆకారంలోనే జాలితో కూడిన డ్రమ్ ఆకారంలో ఉన్న జాలిని బిగించి సైకిల్ వైపు నుంచి రాడ్‌ను డ్రమ్‌లోకి వెళ్లే దారిని పూర్తిగా కప్పేశాడు. డ్రమ్ పై భాగంలో కట్ చేసి దాన్ని మూత తరహాలో రూపొందించాడు. ఆ మూత గుండా బట్టలు అన్నింటిని ఆ డ్రమ్‌లో వేసి, డ్రమ్‌లో నీరు, లిక్విడ్‌ను కూడా పోసి మూత పెట్టేసి సైకిల్ మీద కూర్చొని తొక్కాలి. దీంతో ఆ డ్రమ్ లోపల రాడ్‌తో అమర్చిన జాలి మొత్తం తిరుగుతుంది. అందులో ఉన్న బట్టలు వాషింగ్ మెషిన్‌లో ఉన్న లిక్విడ్ వాటర్‌తో కలిసి శుభ్రం చేస్తాయి. అలా ఒక అర గంట పాటు తొక్కితే వాషింగ్ మెషిన్ తరహాలో బట్టలు ఉతుక్కోవచ్చని విద్యార్థి తెలిపాడు. సైకిల్ తొక్కడం ద్వారా శరీరానికి వ్యాయామం కూడా అవుతుందని పేర్కొంటున్నారు.

ఫిష్ క్యాచింగ్ అండ్ గ్రౌండింగ్ డివైస్



అనుముల గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు అభినవ్ గణేష్, మోక్షజ్ఞులు ఫిష్ క్యాచింగ్ అండ్ గ్రౌండింగ్ డివైస్‌ను రూపొందించారు. ఆరు వెదురు కర్రలు తీసుకుని వాటిని గుండ్రంగా ఊచలాగా ఐరన్ వైర్‌తో కట్టారు. ఆరు కర్రల చుట్టూ మొత్తం జాలిలాగా అల్యూమినియం వైర్‌ను చుట్టారు. గుండ్రంగా ఉన్న ఈ పరికరానికి ఒక వైపు బ్యాటరీ సహకారంతో ఒక లైట్‌ను ఏర్పాటు చేశారు. అందులోకి నీరు పోకుండా ఆ బ్యాటరీ, బల్బు చుట్టు మరో పరికరాన్ని అమర్చారు. దీంతో వెలుతురుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇవతలి మూతి వైపున మొత్తం ఒక పరికరంతో మూసివేశారు. ఆ మూసిన మూతకు మధ్యలో చేప ఆ ఊచలోపలికి వచ్చే విధంగా ఒక రంధ్రం చేశారు. ఆ రంధ్రం గుండా చేప లోపలకు వచ్చిన తర్వాత ఆ రంధ్రం మూసుకునే విధంగా ఏర్పాటు చేశారు. ఊచకు ఒక తాడు కట్టి నీటిలో వేస్తే చేపలు అందులోకి వెళ్తాయి. చేపలు పట్టేందుకు ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థులు చెబుతున్నారు.

సెల్ఫ్ వాటరింగ్ ప్లాంట్ మోటారు



నల్లగొండలోని బొట్టుగూడ హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులు మహేష్, కళ్యాణ్, సెల్ఫ్ వాటరింగ్ ప్లాంట్ మోటార్‌ను రూపొందించారు. రైతు తన పొలం ఎండి పోకుండా ఆటోమెటిక్‌గా పొలంలో నీరు తగ్గినప్పుడు మోటారు ఆన్ అయ్యేందుకు ఈ పరికరం దోహదపడుతుంది. బోరు మోటార్ నుంచి నీరు పొలంలోకి వెళ్లే విధంగా ఒక పైపు అమర్చారు. పొలంలో నీరు ఎంత ఉండాలో ఆ మట్టంలో ఆటోమెటిక్ సెన్సార్‌లను అమర్చారు. ఆ సెన్సార్‌కు వైర్ ద్వారా మరో ఎలక్ట్రికల్ బోర్డును అమర్చారు. అక్కడ సెన్సార్ ద్వారా పొలంలో నీరు తగ్గగానే ఆ సెన్సార్ నుంచి కరెంట్ బోర్డులో ఆటోమెటిక్‌గా మోటారు స్విచ్ ఆన్ అవుతుంది. తిరిగి పొలంలోకి నీరు సరిపడా చేరగానే సెన్సార్ ద్వారా ఆటోమెటిక్‌గా మోటారు స్విచ్ ఆఫ్ అవుతుంది. దీని ద్వారా రైతుకు పొలం ఎండిపోయే అవకాశం లేదు. పైగా రైతు పొలం వద్దకు వెళ్లాల్సిన పని లేకుండా ఈ ఆటోమెటిక్ సెన్సార్ పరికరం దోహదపడుతుంది.

గంజాయి విక్రేతల అరెస్ట్

- ఒడిశా నుంచి కోదాడకు సరఫరా
- ముందస్తు సమాచారంతో పట్టుకున్న మునగాల పోలీసులు
- రెండు కిలోల గంజాయి, నాలుగు బైకులు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం

మునగాల: ఒడిశా నుంచి అక్రమంగా గంజాయిని తీసుకువచ్చి కోదాడలో విక్రయిస్తుండగా మునగాల పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తన కార్యాలయంలో వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం మల్కాజిగిరి జిల్లా చిత్రకొండ గ్రామానికి చెందిన పంగి సీతారామ్ అనే వ్యక్తి గంజాయిని కోదాడకు తీసుకువచ్చి గత మూడునెలలుగా విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో సూర్యాపేట జిల్లాకు చెందిన ఎనిమిది మంది వ్యక్తులు ఈ గంజాయిని సదరు సీతారామ్ నుంచి కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

మునగాల మండలం నారాయణగూడెం గ్రామానికి చెందిన కొచ్చర్ల కేరీ, గరిడేపల్లి మండలం కల్మలచెరువు గ్రామానికి చెందిన కొచ్చర్ల ప్రేమ్‌కుమార్, నేరేడుచర్ల మండలం సోమారం గ్రామానికి చెందిన భీమిశెట్టి మహేష్, చిలుకూరు మండలం పోలేనిగూడెం గ్రామానికి చెందిన తిరగమళ్ల యశ్వంత్, పసుపులేటి శబరినాథ్, కోదాడ మండలం దోరకుంట గ్రామానికి చెందిన వీరబోయిన మధు, కొమ్మగాని సాయినితీష్, చాపల రాకేష్ కొంతకాలంగా సీతారామ్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి కొంత తమ వద్ద ఉంచుకొని మిగతాది చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి ప్యాకెట్ రూ.500 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో గత నెల 28న సీతారామ్ అనే వ్యక్తికి ఫోన్ చేసి గంజాయిని నేరుగా తమ వద్దకు తీసుకువస్తే కేజీకి రూ.10వేలు ఇస్తామని తెలిపారు. దీంతో సీతారామ్ ఈనెల 2న గంజాయితో భద్రాచలం, ఖమ్మం మీదుగా కోదాడలోని ఖమ్మం క్రాస్‌రోడ్డు వద్దకు చేరుకున్నాడు. వీరు గంజాయితో సహా సీతారామ్‌ను తీసుకొని మునగాల మండలం నర్సింహాపురం గ్రామ శివారులో గల మిడ్‌ల్యాండ్ హోటల్ వెనుక గల ఓ వెంచర్‌కు చేరుకున్నారు. అక్కడ సమావేశమైన వీరంతా గంజాయి ఏ విధంగా విక్రయించాలనే చర్చ చేస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు మునగాల పోలీసులు సీతారామ్‌తో సహా ఏడుగురిని పట్టుకున్నారు. నారాయణగూడెం గ్రామానికి చెందిన కొచ్చెర్ల కేరి పరారీలో ఉన్నాడు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.20వేలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసి కోదాడ కోర్టులో రిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ స్పెషల్ టాస్క్‌లో మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారని డీఎస్పీ పేర్కొన్నారు.

మూడు దుకాణాల్లో చోరీ

- ఫర్టిలైజర్ షాపులో రూ.40వేల నగదు అపహరణ
- మరో రెండు దుకాణాల్లో చోరీకి యత్నం



దుకాణంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు, క్లూస్ టీం

పెద్దవూర: మండల కేంద్రంలోని మూడు దుకాణాల్లో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దవూర మండల కేంద్రంలోని వై జంక్షన్‌లో ఆంజనేయ అగ్రిమార్ట్ ఫర్టిలైజర్, సీడ్స్ దుకాణం వెనుక భాగంలో ఉన్న రేకులను గుర్తు తెలియని వ్యక్తులు కట్ చేసి లోనికి ప్రవేశించారు. సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌ను తొలగించి దుకాణంలోని కౌంటర్‌లో ఉంచిన రూ.40వేలను అపహరించారు. సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌ను సైతం తమ వెంట తీసుకెళ్లారు. ఈ దుకాణానికి సమీపంలోనే ఉన్న చిరంజీవి హార్డ్‌వేర్ దుకాణం, సతీష్ బైక్ మెకానిక్ షాపు పైభాగంలో వేసిన ఇనుప రేకులను కట్టర్‌తో కట్‌చేసి లోనికి ప్రవేశించారు. దుకాణాల్లో ఎలాంటి నగదు లేకపోవడంతో వెళ్లిపోయారు. ఉదయం దుకాణాలను తెరిచిన యజమానులకు కౌంటర్‌లు తెరిచి ఉండటం, ఇనుప రేకులు కత్తిరించి ఉండటాన్ని గమనించి దొంగతనం జరిగిందని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ వీరబాబు డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీంను రప్పించి వివరాలు సేకరించారు. ఆంజనేయ అగ్రిమార్ట్ ఫర్టిలైజర్ దుకాణ యజమాని గిరిధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధుడు మృతి

మిర్యాలగూడ టౌన్: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి మిర్యాలగూడ మండలంలోని అద్దంకి- నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టాపురం గ్రామానికి చెందిన బిల్లా కృష్ణమూర్తి (70) తన ఇంటి నుంచి గ్రామంలోని పాల కేంద్రం వద్ద పాలు పోసేందుకు వెళ్లి, తిరిగి అద్దంకి-నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో నగేష్ అనే వ్యక్తి బైక్‌పై దామరచర్ల నుంచి మిర్యాలగూడ వైపు అతి వేగంగా వచ్చి కృష్ణమూర్తిని ఢీకొట్టాడు. దీంతో వృద్ధుడికి బలమైన గాయాలయ్యాయి. అతడిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి, మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నేతలు



కేటీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు

నల్లగొండ టూటౌన్ : హైదరాబాద్‌లోని నందినగర్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావును శుక్రవారం ఉమ్మడి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేతలు కలిశారు. సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులంతా కేటీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్‌కుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇరువర్గాల దాడి కేసులో ఏడుగురి రిమాండ్

సూర్యాపేటటౌన్: సూర్యాపేట మండలం గాంధీనగర్ పెద్దమ్మతల్లి దేవాలయం సమీపంలో రెండు కిరాణ దుకాణదారుల మధ్య జరిగిన దాడి కేసులో ఏడుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ బాలునాయక్ శుక్రవారం తెలిపారు. గాంధీనగర్ సమీపంలో ఉన్న పెద్దమ్మతల్లి దేవాలయం వద్ద జక్కలి అంజమ్మ, బాలెంల నాగమ్మ కిరాణం దుకాణాలు నిర్వహిస్తున్నారు. వ్యాపార విషయంలో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. అయితే బుధవారం ఇద్దరి మధ్య గొడవ పెద్దది కావడంతో రెండు కుటుంబాలకు చెందిన ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ విషయమై ఇరు కుటుంబాలు సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులు గాంధీనగర్‌కు చెందిన బాలెంల శ్రీకాంత్, బాలెంల ఉమేష్, బాలెంల ప్రశాంత్, బాలెంల నాగమ్మ, బాలెంల జానమ్మ, బాలెంల వీరమ్మ, బాలెంల వెంకన్నను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం వ్యాపారిపై పీడీ యాక్ట్ కేసు నమోదు

మిర్యాలగూడ అర్బన్: రేషన్ బియ్యాన్ని ప్రజల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి రాత్రి సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్న అదే రాష్ట్రంలోని దాచేపల్లి మండలం కేంద్రానికి చెందిన మందపాటి నరసింహారావుపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ రాజశేఖరరాజు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో నిందితుడికి పీడీ యాక్ట్ పత్రాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. 2015 నుంచి రేషన్ బియ్యం వ్యాపారం చేస్తుండటంతో అతడిపై అనేక కేసులు నమోదయ్యాయని, పలు కేసుల్లో జైలుకు కూడా పంపామని తెలిపారు. అయినా తీరు మార్చుకోకుండా తిరిగి రేషన్ బియ్యం వ్యాపారం సాగిస్తున్నాడని తెలిపారు. అక్రమ వ్యాపారాన్ని నిరోధించేందుకు ఎస్పీ ఆదేశాలతో పీడీ యాక్ట్ కేసు నమోదు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు చెప్పారు.

కల్తీ ఎరువులతో జాగ్రత్త!

- పంట ఎదుగుదల, దిగుబడిపై తీవ్ర ప్రభావం
- పరీక్షించుకున్న తరువాతే వాడడం మేలు



పాడి పంట

పెద్దవూర: కూరగాయల సాగు, ఉద్యానవన పంటలు, వాణిజ్య పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలని అన్నదాతలు ఎరువులను విరివిగా వాడుతుంటారు. ఎరువుల్లో కల్తీ జరిగితే రైతులు తీవ్రంగా నష్టపోతారు. వేల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసే ఎరువుల్లో కల్తీ ఉంటే దాని ప్రభావం పంట ఎదుగుదలతో పాటు దిగుబడులపై కూడా ఉంటుంది. ఎరువుల్లో కల్తీని గుర్తించడం, ఎరువులను పరీక్షించడం గురించి పెద్దవూర మండల వ్యవసాయ అధికారి పి.సందీప్ వివరించారు. ఎరువుల వాడకంపై రైతులకు సూచనలు, సలహాలు ఆయన మాటల్లోనే..

ఎరువుల కల్తీ ఇలా..

ప్రస్తుతం మార్కెట్‌లోకి కల్తీ, నాసిరకం, నకిలీ ఎరువులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పోషకాలు తక్కువగా ఉన్న వాటిని రైతులకు అంటగడుతున్నారు. అమ్మోనియం క్లోరైడ్, అమ్మోనియం సల్ఫేట్‌లలో ఉప్పు కలుపుతారు. సూపర్ ఫాస్ఫేట్‌లో సుద్దపొడి, జిప్సం, యూరియాలో సాధారణ ఉప్పు కలిపే అవకాశం ఉంది, ఎంఓపీలో ఇసుక, ఉప్పు కలిపే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గుళిక రూపంలోని సూపర్ ఫాస్ఫేట్‌ను డీఏపీ లేదా ఎస్‌పీజే కాంప్లెక్స్ ఎరువులుగా నమ్మించి అమ్ముతుంటారు. సాధారణ ఉప్పును కూడా ఎంఓపీగా, లేక సల్ఫేట్‌గా, మెగ్నీషియం సల్ఫేట్‌ను జిక్ సల్ఫేట్‌గా విక్రయిస్తుంటారు.

నాణ్యత పరీక్షలు..

- ఒక పరీక్ష నాళికలో ఒక గ్రాము యూరియాను 5 మిల్లీ లీటర్ల నీటిలో వేసి బాగా కలియబెట్టాలి. దీనిలో 5-6 చుక్కల సిల్వర్ నైట్రేట్ ద్రావణం కలపాలి. తెల్లటి అవక్షేపంగా మారితే అది కల్తీ ఎరువుగా గుర్తించాలి.
- పొడిలా తయారు చేసుకున్న గ్రాము డీఏపీని పరీక్ష నాళికలో వేసి 5 మిల్లీ లీటర్ల స్వచ్ఛమైన నీటిలో కలపాలి. దానికి ఒక మిల్లీ లీటర్ నైట్రిక్ యాసిడ్ వేసి కదిపితే అర్థ పారదర్శక ద్రావణం ఏర్పడితే అది నాణ్యమైనదిగా, అలా కాకుండా కరగని పదార్థం అడుగు భాగంలో చేరితే కల్తీదిగా భావించాలి.
- పరీక్ష నాళికలో ఒక గ్రాము మ్యూరేట్ ఆఫ్ పొటాష్(ఎంఓపీ) ఎరువులో 5 మిల్లీ లీటర్ల నీటిని పోసి బాగా కరిగేటట్లు చేయాలి. కొద్దిపాటి ఎరువు పదార్థం నీటిపై తేలితే స్వచ్ఛమైన ఎరువుగా, ఎక్కువ మొత్తంలో కరగకుండా అడుగుభాగం చేరితే అది కల్తీ ఎరువుగా గుర్తించాలి.
- కాంప్లెక్స్ ఎరువుల విషయంలో గ్రాము ఎరువును 5 మిల్లీ లీటర్ల నీటిలో కలిపి బాగా కదపాలి. దీనికి మిల్లీ లీటర్ సోడియం హైడ్రాక్సైడ్ ద్రావణం కలిపి ఒక వైపు నుంచి పరీక్ష నాళికను వేడిచేయాలి. తడిగా ఉన్న ఎర్ర లిట్మస్ పేపర్‌ను పరీక్ష నాళిక ద్వారం దగ్గర ఉంచితే లిట్మస్ కాగితం నీలి రంగులోకి మారితే నత్రజని ఉందని గుర్తించాలి. అదే పరీక్షకు 2 మిల్లీలీటర్ల ఫెర్రిక్ క్లోరైడ్ అమ్మోనియం ఎసిఫేట్ కలపాలి. పసుపు రంగు అవక్షేపం వస్తుంది. దీనికి 5-6 చుక్కల నైట్రిక్ యాసిడ్ కలిపితే అవక్షేపం కరిగిపోతుంది. అలా జరిగితే ఫాస్పేట్ ఉన్నట్లు గుర్తించాలి.
- గ్రాము ఎరువును తీసుకుని 5 మిల్లీ లీటర్ల నీటిలో ఎరువును కరిగించాలి. ఫిల్టర్ పేపర్ సాయంతో వడపోయాలి. దీనికి 2 మిల్లీ లీటర్ల ఫార్మ డీహైడ్ ద్రావణం కలపాలి. 5 నిమిషాల తర్వాత ద్రావణం ఎరువులా మారుతుంది. దీనికి సోడియం హైడ్రాక్సైడ్ ద్రావణం ఒక్కొక్క చుక్క పసుపు రంగు వచ్చేదాకా కలపాలి. దీనికి మిల్లీ లీటర్ కోబాల్ట్ నైట్రేట్ ద్రావణం కలిపితే పసుపు పచ్చ అవక్షేపం ఏర్పడుతుంది. ఇలా జరిగితే ఎరువులో పొటాష్ ఉన్నట్లు గుర్తించాలి.
- ఎరువుల కొనుగోలు విషయంలో దుకాణం గుడ్‌విల్‌ను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. కొనుగోలు సమయంలో రశీదులు తీసుకోవడం మర్చిపోకూడదు. ఎరువుల పరీక్షలు చేయడం రైతులకు ఇబ్బంది అనిపించినా, అనుమానం వచ్చినా వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలి.